


### సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.




### ఇదో రకం.. నరకం !

అరుదైన జన్యుపర వ్యాధి హిమోఫిలియా. తగినంత ప్రొటీన్లు లేకపోవడంతో రక్తం గడ్డకట్టదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ వ్యాధితో బాధపడే వారు 131 మంది ఉన్నారు. 8లో▸



### డీజిల్ దొంగలు దొరికారు

డీజిల్ చోరీని వృత్తిగా ఎంచుకున్న ముఠా ఎట్టకేలకు పోలీసులు పట్టుబడింది. బుధవారం 11 మంది దొంగలను ఆదోని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో▸

# ద్రోహంపై నెగ్గిన విశ్వాసం

**ఉన్నత పదవిని కట్టబెట్టిన** పార్టీని కాదని, అధికారం కోసం బీజేపీ పంచన చేరిన ఆదోని మునిసిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గుణపాఠం చెప్పారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమెను పదవి నుంచి దింపేశారు. ఆ పార్టీకే చెందిన బోయ లోకేశ్వరిని చైర్‌పర్సన్‌గా శుక్రవారం ఎన్నుకోనున్నారు. చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు శతవిధాల ప్రయత్నాలు చేసి కౌన్సిలర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేయాలని భావించిన ఎమ్మెల్యే పార్థసారథికి ఎదురు దెబ్బ తగిలింది. కౌన్సిలర్లు ఏకతాటిపై నిలిచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వసనీయత చాటుకున్నారు.

### వైఎస్సార్‌సీపీలో గెలిచి బీజేపీ పంచన చేరిన ఆదోని మునిసిపల్ చైర్‌పర్సన్ శాంత

- ఎమ్మెల్యే పార్థ సమక్షంలో బీజేపీ కండువా వేసుకున్న శాంత భర్త నాగేంద్ర
- పార్టీకి ద్రోహం చేయడంపై కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం
- శాంతకు వ్యతిరేకంగా 36 ఓట్లు, విశ్వాసం కోల్పోయిన వైనం
- కొత్త చైర్‌పర్సన్‌గా లోకేశ్వరిని రేపు ఎన్నుకోనున్న కౌన్సిలర్లు
- ఫిరాయింపు రాజకీయాలకు చెంప పెట్టుగా ఆదోని కౌన్సిలర్లు
- బీజేపీ ప్రలోభాలకు లొంగకుండా నిలిచిన కౌన్సిలర్లకు వైఎస్సార్‌సీపీ అభినందనలు

ఆదోని టౌన్: ఆదోని మునిసిపల్ ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి మునిసిపల్ పీఠం దక్కితే రెండున్నరేళ్లు బోయ శాంత, ఆ తర్వాత లోకేశ్వరి కొనసాగాలని అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికలకు వెళ్లారు. మొత్తం 42 వార్డులలో 41 వార్డులు వైఎస్సార్‌సీపీ, ఒక వార్డు టీడీపీ దక్కించుకున్నాయి. మెజార్టీ స్థానాలు దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ తరఫున శాంత మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. రెండున్నరేళ్ల తర్వాత రాజీనామా చేయాల్సి ఉంది. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ వ్యవహారంపై పార్టీ దృష్టి సారించలేదు. ఎన్నికల తర్వాత ఒప్పందం ప్రకారం రాజీనామా చేయాలని శాంతకు, ఆమె భర్త నాగేంద్రకు సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోవడం, కూటమి అధికారంలోకి రావడంతో అధికార కాంక్షతో నాగేంద్ర ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీ కండువా వేసుకున్నారు. ఆ తర్వాత మరో నలుగురు కౌన్సిలర్లను బీజేపీలోకి చేర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీకి నాగేంద్ర, శాంత దూరంగా ఉంటూ ఎమ్మెల్యే కనుసన్నల్లో నడుస్తున్నారు. ఆదోని అభివృద్ధికి పాటుపడకుండా ఎమ్మెల్యే కనుసన్నల్లో నడిచారు. ఈక్రమంలో కౌన్సిలర్లు మార్చి 19న కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి శాంతపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు.



అవిశ్వాస తీర్మానానికి నడిచి వెళ్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

#### అవిశ్వాస తీర్మానం నెగ్గిన వైఎస్సార్‌సీపీ

బుధవారం ఉదయం ప్రత్యేక బస్సులో కౌన్సిలర్లు ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాలుకు చేరుకున్నారు. ఎన్నికల అధికారి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రాగానే అవిశ్వాస తీర్మానంపై ప్రకటన చేశారు. శాంతపై అవిశ్వాస తీర్మానాన్ని కౌన్సిలర్ బాలజీ యాదవ్ ప్రవేశపెట్టారు. దీన్ని మరో కౌన్సిలర్ సందీప్‌రెడ్డి బలపరిచారు. ఆ తర్వాత 35 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే మధుసూదన్ మొత్తం 36మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో చైర్‌పర్సన్ బోయ శాంతపై అనర్హత వేటు వేస్తున్నట్లు సబ్ కలెక్టర్ ప్రకటించారు. త్వరలోనే నూతన చైర్‌పర్సన్ ఎన్నిక జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు.

#### ఆదోని అభివృద్ధి కోసమే అవిశ్వాస తీర్మానం

ఆదోని అభివృద్ధి కోసం పలు అభివృద్ధి పనులు కౌన్సిల్ దృష్టికి, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినా శాంత నిర్లక్ష్యం చేశారని, అందుకే తాము అవిశ్వాసం ప్రవేశపెట్టామని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, నరసింహులు, రాజేశ్వర్‌రెడ్డి, నాగరాజ్, ఎస్.పి.లక్ష్మీదేవి, లోకేశ్వరి తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేతో కుమ్మక్కై వైఎస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ పాలకవర్గాన్ని ఛిన్నాభిన్నం చేయాలనే లక్ష్యంతో ఉన్న చైర్‌పర్సన్‌పై తాము అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి తొలగించినట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదోని కొత్త చైర్‌పర్సన్‌గా బోయ లోకేశ్వరిని కౌన్సిలర్లు ఎన్నుకోనున్నారు. రేపు సబ్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ ఈ ఎన్నికను నిర్వహించనున్నారు.

#### కౌన్సిలర్లకు సెల్యూట్

బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీపై విధేయత చూపి పార్టీ వైపు నిలబడిన 35మంది కౌన్సిలర్లను జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అభినందించారు. కౌన్సిలర్ల వ్యక్తిత్వం పార్టీలో పదవులు దక్కించుకున్న ప్రతీ వ్యక్తికి ఆదర్శమని కొనియాడారు.

## విశ్వసనీయత విజయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో నీతి, విలువలు, విశ్వసనీయత విజయం సాధించాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదోని ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుల కృషితోనే అవిశ్వాస తీర్మానంలో విజయం సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రంలో పలుచోట్ల అవిశ్వాస తీర్మానాలు పెట్టారని, అయితే స్వల్పంగా విజయం సాధించినా ఆదోనిలో అత్యధిక మెజార్టీతో గెలుపొందడం హర్షణీయమన్నారు. సాయన్న(మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి) అంటే సాధిస్తాడనే నమ్మకం ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆల్ఫాబెట్ ప్రకారంగా ఏ అంటే ఆదోని అని, అలాంటి ఆదోనిలోనే వైఎస్సార్సీపీకి అనుకూలంగా అవిశ్వాస తీర్మానంలో నెగ్గామన్నారు. వచ్చే 2029 ఎన్నికల్లో ఆదోని నుంచే విజయం ప్రారంభమవుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతోనే పాలకవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మానంలో పాల్గొని విజయం సాధించడం హర్షణీయమన్నారు. ఆదోని మున్సిపల్ పాలకవర్గ సభ్యుల తీరు ప్రశంసనీయమని, ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్టతను ఎల్ఎల్‌సీ కెనాల్‌లో కలిపివేశారన్నారు. ఇది నమ్మకానికి ప్రతీక అని చెప్పారు. ఆదోని నుంచే 2029లో ఎన్నికల సమరం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ఉమ్మడి జిల్లాకు 80 డ్రోన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు 80 డ్రోన్‌లు మంజూరయ్యాయి. కర్నూలు జిల్లాకు 40, నంద్యాల జిల్లాకు 40 ప్రకారం కేటాయించారు. టీడీపీ కార్యకర్తలతో ఏర్పాటైన ఎఫ్ఎంబి కిసాన్ డ్రోన్ గ్రూపులకు మంజూరు చేస్తోంది. వీటిని సరఫరా చేసేందుకు డ్రోగో, విహంగ కంపెనీలను ఎంపిక చేసింది. డ్రోగో కంపెనీ డ్రోన్ పూర్తి ధర రూ.9.80 లక్షలు, విహంగ కంపెనీ డ్రోన్ ధర రూ.9.81 లక్షలు ఉంటుంది. ఇందులో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇస్తుంది. అయితే 50 శాతం మొత్తానికి బ్యాంకులు రుణాలు ఇస్తాయి. మిగిలిన 50శాతం కిసాన్ డ్రోన్ గ్రూపులు భరిస్తాయి. ఎఫ్ఎంబీ కిసాన్ డ్రోన్ గ్రూపులో 5గురు సభ్యులు ఉంటాయి. గ్రూపు సభ్యులు పైలెట్‌గా ఎంపిక చేసుకొన్న వారికి ప్రభుత్వం ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. డ్రోన్‌ల సామర్థ్యం 25 లీటర్లు ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

### సీయూలో పీజీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ (సీయూ) పరిధిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ (పీజీ) నాల్గో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలను బుధవారం వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వి. వెంకట బసరావు పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ పాలక వర్గాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఎమ్మిగనూరు, పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు త్వరలో పాలక వర్గాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇది వరకు కూటమి ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు చైర్మన్‌లను ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి స్థాయి పాలక వర్గాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ ప్రతిపాదనలు పంపింది. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీకి కురువ మల్లేష్, పత్తికొండ మార్కెట్ కమిటీకి ఎస్.నబీసాహెబ్ చైర్మన్‌లుగా నియమితులు కానున్నారు. వైస్ చైర్మన్, పాలక వర్గం సభ్యులతో జీవోల కోసం ప్రతిపాదనలు పంపినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి తెలిపారు.

### జల్‌జీవన్ పనుల పరిశీలన



ట్యాంకు పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.84 కోట్ల నిధులతో మద్దికెరలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులను కేంద్ర బృందం సభ్యుడు మాదేశ్వరన్ బుధవారం పరిశీలించారు. ట్యాంకు త్వరలో పనులు పూర్తి చేసి నీటిని అందిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా జల్‌జీవన్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎండీ ఖాన్, ఏఈ మయాంక్, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సచివాలయ ఏఈలు విష్ణు, చంద్రశేఖర్, బండారి ఆంజనేయులు ఉన్నారు.

## ఆరుగురు ఎస్ఐలకు మళ్లీ స్థానచలనం

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 9న వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న 18 మంది ఎస్ఐలకు స్థానచలనం కలిగిన సంగతి తెలిసిందే. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఆ జాబితాలోని కొందరి బదిలీలను రద్దు చేసి తాజాగా మరో ఆరుగురు ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- కోడుమూరు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏపీ శ్రీనివాసులును మొదట కర్నూలు టూటౌన్‌కు బదిలీ చేసి ఆ ఉత్తర్వులను రద్దు చేసి తాజాగా చిప్పగిరి పోలీస్ స్టేషన్‌కు నియమించారు. అక్కడ ఉన్న సతీష్ కుమార్‌ను కర్నూలు టూటౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- గూడూరులో పనిచేస్తున్న తిమ్మయ్య ఇస్వీ పీఎస్‌కు బదిలీ అయ్యారు. అయితే ఆ బదిలీని రద్దు చేసి గూడూరులోనే కొనసాగేలా తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి.
- పెద్దకడుబూరులో పనిచేస్తున్న నిరంజన్ రెడ్డి గూడూరు పీఎస్‌కు నియమితులు కాగా, ఆ బదిలీని రద్దు చేసి పెద్దకడుబూరులోనే కొనసాగేలా తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- ఎమ్మిగనూరు టౌన్ యూపీఎస్‌లో పనిచేస్తున్న నాయక్ పెద్దకడుబూరు పీఎస్‌కు బదిలీ కాగా తాజా ఉత్తర్వుల్లో ఆయనను ఇస్వీ పీఎస్‌కు నియమించారు.
- కర్నూలు స్పెషల్ బ్రాంచ్ విభాగం (డీఎస్బీ)లో పనిచేస్తున్న సీహెచ్ ఖాజావలిని కర్నూలు మహిళా పీఎస్‌కు బదిలీ చేసి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు డీఎస్బీ విభాగంలోనే కొనసాగాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పోలీసు సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధం

కర్నూలు: పోలీసు శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల బదిలీలకు జాబితా సిద్ధమైంది. ఐదేళ్ల పాటు ఒకేచోట పనిచేసిన వారికి స్థానచలనం కల్పించేలా జాబితాను రూపొందించినట్లు సమాచారం. ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారు 153 మంది దాకా ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇందులో ఏఎస్ఐలు 12 మంది, హెడ్ కానిస్టేబుళ్లు 24 మంది, కానిస్టేబుళ్లు 110 మందితో అర్హుల జాబితా సిద్ధమైనట్లు తెలిసింది. ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్, నియోజకవర్గం, సొంత మండలం కాకుండా మరో ప్రాంతానికి బదిలీ చేసేలా జాబితాను రూపొందించారు. మూడు ఆప్షన్లు పొందుపరుస్తూ ఈనెల 19వ తేదీ లోపు సబ్ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో తమకు అనుకూలమైన స్థానాల్లో పోస్టింగులు పొందేందుకు సిబ్బంది ప్రయత్నాలు తీవ్రం చేశారు. సిఫారసు లేఖలకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు మొదలయ్యాయి.

## ప్రారంభం కావాలి.. మళ్లీ మళ్లీ!

- 19న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్
- గత ఏడాది మార్చిలో ప్రారంభించిన అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభోత్సవానికి ఈ నెల 19న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రానున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించడంతో పాటు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు విభాగాలను పరిశీలిస్తారు. అనంతరం మెడికల్ కాలేజీలో వైద్యులతో ముఖాముఖి నిర్వహించి పలు అంశాలపై సమీక్షిస్తారు. అనంతరం ఆయన భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ నివాసానికి వెళ్లనున్నారు. కాగా గత సంవత్సరం మార్చిలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ కేంద్రంలో వైద్య సేవలు సైతం పాక్షికంగా అందిస్తూ వచ్చారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో మళ్లీ దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయడం గమనార్హం.

## దురలవాట్లకు దూరంగా ఉండాలి

- సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్



పోలీసులతో సమీక్ష నిర్వహిస్తున్న సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్

కర్నూలు: హోంగార్డులు దురలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని హోంగార్డు కార్యాలయంలో బుధవారం రాయలసీమ జిల్లాల (8 జిల్లాలు) హోంగార్డు ఇన్‌చార్జి పోలీసు అధికారులతో మహేష్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి వారు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందరికీ ఒకే విధమైన నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన వారి పిల్లలకు కారుణ్య నియామకాల ఉద్యోగాలు, ఎక్స్‌గ్రేషియా త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హోంగార్డు ఇన్‌చార్జిలు, ఆర్ఐలు వారి విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర, హోంగార్డ్స్ డీఎస్పీలు కేవీవీ ఎస్వీ ప్రసాద్, కేజేఎం చిరంజీవి, భాస్కర్ రావు, ఆర్ఐ జావెద్, హోంగార్డ్స్ ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, పోతల రాజు తదితరులు పాల్గొన్నారు.

## వంద శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధి

- డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వంద శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధిని చేసుకోవచ్చుని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి.. భూమికి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉంటే పండ్లతోటల సాగుకు వంద శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. అయితే రైతులు ఇంతకు ముందు ఏ శాఖల నుంచి లబ్ధిపొంది ఉండరాదని పేర్కొన్నారు. మామిడి, బత్తాయి. నిమ్మ, జామ,సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్‌బేర్(రేగు), డ్రాగన్‌ఫ్రూట్స్, మునగ, అంజూర, అలాగే గులాబీ, మల్లె తోటలు అభివృద్ధి చేసుకోవచ్చాన్నారు. మునగ, మల్లె, గులాబీ, ఆపిల్‌బేర్ పండ్లతోటలకు మెయిన్‌టెన్స్ బిల్లులు రెండేళ్ల, మిగిలిన పంటలకు మూడేళ్ల చెల్లిస్తారన్నారు. ఆసక్తి ఉన్న రైతులు 9121103297ను సంప్రదించాలన్నారు.

# ఆయకట్టులో పారింది కన్నీళ్లే!

### కేసీ, తెలుగుగంగ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో అందని నీరు

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్మన్ పాపిరెడ్డి
- ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలకు రూ.1.54 కోట్ల జెడ్పీ నిధులు
- జెడ్పీ ముందున్న హోర్డింగ్స్ తొలగింపుకు ఆమోదం
- కోరం లేక 4, 5, 6 స్థాయీ సంఘాలు వాయిదా





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, హాజరైన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): "కేసీ కెనాల్, తెలుగుగంగ నుంచి పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయకపోవడం వల్లే ఆయకట్టు రైతులు నష్టపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్ కింద లక్ష ఎకరాలకు, తెలుగుగంగ కింద 84 వేల ఎకరాలకు నీరిచ్చామని అధికారులు చెబుతున్నారు. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందిస్తే రైతులు ఎందుకు ఇబ్బంది పడతారు. రైతుల కష్టాలను పత్రికలు ప్రధానంగా ప్రచురించాయి. ఆ కథనాలు అవాస్తవమా?'' అని జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేఆర్ఎంబీ నిబంధనల మేరకు కొంత ఒడిదుడుకుల మధ్య నీటిని అందించామని ఇరిగేషన్ అధికారులు చెప్పిన సమాధానం పట్ల చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. శ్రీశైలంలో నీటి మట్టం 854 అడుగుల కంటే తక్కువ ఉన్న సందర్భాల్లో తెలంగాణ ప్రభుత్వం పవర్ జనరేట్ చేయరాదనే అంశాన్ని కేఆర్ఎంబీ సమావేశంలో ప్రభుత్వం ద్వారా ఎందుకు చెప్పించలేకపోయారని ప్రశ్నించారు. జూరాల నుంచి 1700, సుంకేసుల నుంచి 300 టీఎంసీలు (మొత్తం 2 వేల టీఎంసీలు) శ్రీశైలానికి వెళ్లినా, మనం ఉన్న రిజర్వాయర్లలో ఎందుకు నీటిని నిల్వ చేసుకోలేకపోయామరు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గడిచిన స్థాయీ సంఘ సమావేశాల్లో చర్చించిన నేపథ్యంలోనే గాజులదిన్నె ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడం వల్ల కోడుమూరు, తదితర ప్రాంతాల రైతులు, ప్రజలకు ఎంతో ఉపయోకరంగా ఉందన్నారు.

#### మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల గైర్హాజరు

జిల్లా పరిషత్ పరిధిలోని ఏడవ స్థాయీ సంఘంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఒకటవ స్థాయీ సంఘంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఉన్నారు. మిగిలిన ఐదు స్థాయీ సంఘాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు. అయితే బుధవారం జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు ప్రజా ప్రతినిధులతో పాటు మెజారిటీ జెడ్పీటీసీ సభ్యులు కూడా హాజరు కాకపోవడం గమనార్హం.

#### తాగునీటి అవసరాలకు జెడ్పీ నిధులు రూ.1.54 కోట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా పరిషత్ నుంచి రూ.1.54 కోట్లను మంజూరు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి 46 పనులను గుర్తించి మంజూరు చేశామన్నారు. ఈ పనులను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆయన కోరారు. మొత్తం పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 352 పనులు కేటాయించామని, ఇందులో ఇప్పటి వరకు 21 పూర్తయ్యాయని, మిగిలిన 331 పనులను జూన్, జూలై నాటికి పూర్తి చేయాలన్నారు.

#### సమావేశాల్లో ఎవరేమన్నారంటే ...

- దివ్యాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ వల్ల ప్రజల్లో భయాందోళనలు ఉన్నాయి. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్ ఆధారంగానే పెన్షన్లు మంజూరు చేశారు కదా, ఇప్పుడెందుకు వెరిఫికేషన్ చేస్తున్నారు.మేజర్, మైనర్ మినరల్స్‌కు ఒకే రకమైన నిబంధనలు విధించడం వల్ల మైనర్ మినరల్స్ చాలా ఇబ్బంది పడుతున్నాయి.
  – జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తోంది. కొత్త పెన్షన్లు ఎప్పుడిస్తారు. – సుంకన్న, వెల్దుర్తి జెడ్పీటీసీ
- పచ్చ బొక్కాల వారికే మినీ గోకులాలను మంజూరు చేస్తున్నారు. పశువులు ఉన్న రైతులకు మంజూరు చేస్తే బాగుంటుంది.
  – బి.పులికొండనాయక్, తుగ్గలి జెడ్పీటీసీ
- ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌కు నీటిని నందికొట్కూరు ఊరుబయట నుంచి తీసుకువెళ్లాలి. ఊర్లో పైప్‌లైన్లు వేస్తే తాగునీటికి సంబంధించిన సిస్టమ్ డిస్టర్బ్ అయ్యే ప్రమాదం ఉంది. ట్రాఫిక్, వ్యాపారాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.
  – పి.జగదీశ్వరరెడ్డి, జూపాడుబంగ్లా జెడ్పీటీసీ
- గడివేముల–బూజనూరు రోడ్డును బాగు చేయండి.
  – గడివేముల జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి

#### జెడ్పీ ముందున్న హోర్డింగ్స్ తొలగింపునకు ఆమోదం

జిల్లా పరిషత్ భవనం ముందు భాగాన ఉన్న హోర్డింగ్స్‌ను తొలగించేందుకు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ హోర్డింగ్స్‌కు సంబంధించి ఒక చదరపు అడుగు రూ.212 ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇదే ఏడాది జూన్ 30వ తేదీ వరకు చెల్లించాలని జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో తీర్మానం చేశారు. అయితే హోర్డింగ్స్ ఏజెన్సీ ఒక చదరపు అడుగుకు రూ.100 మాత్రమే చెల్లించగలమని చెప్పడం వల్ల ఈ నెల 16వ తేది వరకు ఒక చదరపు అడుగుకు రూ.212 ప్రకారం చెల్లించి హోర్డింగ్స్ తీసివేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

#### కోరం లేక 4, 5, 6 స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అవసరమైన కోరం (సభ్యులు) లేకపోవడం వల్ల విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం ( 4,5,6 ) శాఖలకు సంబంధించిన స్థాయి సంఘ సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ప్రకటించారు.

## క్లుప్తంగా

### గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు

పాణ్యం: భూపనపాడు గ్రామానికి చెందిన బొనిగెని వెంకటేశ్వర్లు (60) గ్రామ చెరువులో శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం చేపల కోసం వెళ్లగా ఈతరాక నీటిలో మునిగిపోయాడు. రెండు రోజుల పాటు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గజ ఈతగాళ్లతో నీటిలో గాలించగా వెంకటేశ్వర్లు మృతదేహం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### 35 తులాల బంగారు నగలు మాయం


కర్నూలు: మంగళగిరికి చెందిన శిరీష, నరసింహ దంపతులు ఈనెల 12వ తేదీన కర్నూలులో ఉన్న బంధువుల వివాహ వేడుకలకు హాజరయ్యారు. తిరిగి 13వ తేదీ మంగళగిరికి చేరుకున్న తర్వాత బ్యాగ్‌లో ఉన్న రూ.22 లక్షలు విలువ చేసే 35 తులాల బంగారు ఆభరణాలు కనిపించ లేదు. దీంతో బాధితులు 14వ తేదీన తిరిగి కర్నూలు చేరుకుని రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే వివాహ వేడుకలు జరిగిన ప్రాంతంలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా స్థానికంగా చోరీ జరగలేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మార్గమధ్యలో బ్యాగులో ఉన్న నగలను దొంగలు తస్కరించి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. అయితే బాధితులు ఓ మంత్రితో సిఫారసు చేయించడంతో రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేసినట్లు సమాచారం.

### రెండు గడ్డి వాములు దగ్ధం

సి.బెళగల్: కె.సింగవరం గ్రామానికి చెందిన చిన్న హనుమంతు రైతుకు చెందిన రెండు గడ్డి వాములు ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యాయి. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలలుకు మెయిన్ విద్యుత్ తీగలు తెగి గడ్డి వాములపై పడటంతో నిప్పు రవ్వలు ఎగిసి మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపు కాలేదు. దీంతో గ్రామస్తులు కోడుమూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చే లోపు రెండు భారీ గడ్డివాములతో పాటు పక్కనే ఉన్న షెడ్‌లో వ్యవసాయ పనిముట్లు, బైక్ సైతం మంటలకు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు చిన్న హనుమంతు కోరుతున్నాడు.

# ఇదో రకం.. నరకం!

- హిమోఫిలియా జబ్బుతో ఆగకుండా రక్తస్రావం
- రక్తం గడ్డ కట్టే స్వభావం ఉండదు
- ఉమ్మడి జిల్లాలో 131 మంది బాధితులు
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స కేంద్రం
- నేడు వరల్డ్ హిమోఫిలియా డే






హిమోఫీలియాను తెలిపే చిత్రం

కర్నూలు(హాస్పిటల్): మనలో చాలా మందికి ఎప్పుడో ఒకసారి వేలు తెగి రక్తం కారుతుంది. తెగిన చోట కొన్ని సెకన్లు నొక్కి పడితే వెంటనే రక్తస్రావం ఆగిపోతుంది. కానీ హిమోఫీలియా అనే అరుదైన వ్యాధిగ్రస్తుల్లో మాత్రం గాయమైన చోట రక్తం ఆగకుండా కారుతూనే ఉంటుంది. వారి రక్తంలో గడ్డకట్టే ప్రొటీన్లు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. కొంత మందికి అంతర్గత రక్తస్రావం అయి బలహీనంగా మారిపోతూ ఉంటారు. ఇలాంటి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17వ తేదీన వరల్డ్ హిమోఫిలియా డేగా నిర్వహిస్తారు. హిమోఫిలియా అనేది అరుదైన జన్యుపర వ్యాధి. ఇందులో రక్తం గడ్డకట్టే తగినంత ప్రొటీన్లు (గడ్డకట్టే కారకాలు) లేకపోవడం వల్ల రక్తం సాధారణంగా గడ్డకట్టదు. ఈ పరిస్థితిలో చిన్న గాయాలకే అధిక రక్తస్రావం అవుతుంది. కొంత మందిలో ఎలాంటి గాయాలు కాకుండానే అంతర్గతంగా కూడా రక్తస్రావం అవుతుంది. దీన్ని బ్లీడర్స్ డిసీస్ అని కూడా అంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ వ్యాధితో బాధపడే వారు 131 మంది దాకా ఉన్నారు. ఒక్క కర్నూలు జిల్లాలోనే 89 మంది ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా ఇలాంటి బాధితులను గుర్తించి అధికారంలోకి వచ్చిన తర్వాత నెలకు రూ.10 వేల ఫించన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేశారు. ఈ కారణంగా గత ఆరేళ్లుగా వీరు ప్రతి నెలా రూ.10వేల పింఛన్ అందుకుంటున్నారు.

**మగపిల్లల్లోనే ఎక్కువ**

హిమోఫిలియా జన్యుపరమైన వ్యాధి. ఇది ఎక్కువగా వారసత్వంగా వస్తుంది. ప్రధానంగా మగపిల్లల్లో ఎక్కువగా ఇది కనిపిస్తుంది. ఈ వ్యాధి జన్యువు ఎక్స్ క్రోమోజోముపై ఉంటుంది. ఇది తల్లి వాహకంగా పనిచేస్తుంది. స్త్రీలలో ఈ వ్యాధి సంఖ్యాకులు పురుషులతో పోలిస్తే తక్కువ. దీనికి తాలూకు జన్యువు ఉన్నప్పటికీ వారిలో ఉండే రెండు ఎక్స్ క్రోమోజోముల్లో ఒక ఎక్స్ క్రోమోజోము దానిని అణిచివేస్తుంది. ఈ వ్యాధిలో రక్తం గడ్డకట్టేందుకు, రక్తస్రావం ఆపడానికి అవసరమైన ప్రక్రియ శరీర సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. శరీరానికి గాయం తగిలితే వెంటనే ఆగకుండా రక్తం కారుతుంది. కీళ్లు, మెదడులోపల రక్తస్రావం సైతం ఎక్కువ కాలం జరుగుతుంది. ఈ కారణంగా వారు పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూనే ఉంటారు.

**పెద్దాసుపత్రిలో ప్రత్యేక కేంద్రం**

ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఫర్ హిమోగ్లోబినోపతీస్, హిమోఫిలియా (ఐసీహెచ్‌హెచ్) టెస్టింగ్ అండ్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లను గత ప్రభుత్వం 2020లో విశాఖపట్టణం, ఈస్ట్‌గోదావరి, గుంటూరుతో పాటు కర్నూలుకూ మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ కేంద్రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు కేంద్రం పక్కనున్న డైస్‌లో కొనసాగుతోంది. ఇక్కడ తలసీమియాతో పాటు సికిల్‌సెల్, హిమోఫిలియా బాధితులకు చికిత్స అందిస్తారు. ఈ మేరకు అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించారు.

**వ్యాధికి కారణాలు**

ప్రతి వ్యక్తి శరీరంలోని రక్తప్రసరణ వ్యవస్థలో రక్తం గడ్డకట్టేందుకు కోయాగ్యులేషన్ ఫ్యాక్టర్స్ అనే రసాయనాలు ఉంటాయి. అయితే హిమోఫిలియా వ్యాధి ఉన్న వారిలో ఇలాంటివి లోపిస్తాయి. అవి ఫ్యాక్టర్ 8, ఫ్యాక్టర్ 9. రక్తస్రావ సమయంలో ఏది కోల్పోతే దానిని తిరిగి రక్తం ద్వారా వేరు చేసిన ఫ్యాక్టర్లను రోగికి ఎక్కిస్తారు.

**వ్యాధి లక్షణాలు**

ఇది ఎక్కువగా వారసత్వంగా జన్యులోపం. ఇది రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావం ఆపడానికి అవసరమైన ప్రక్రియను, శరీర సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. ఇది శరీరానికి గాయం తగిలిన వెంటనే తేలికగా రక్తం కారడం, కీళ్లు, లేదా మెదడులోపల రక్తస్రావం వంటిది అధిక ప్రమాదం తెచ్చి పెడుతుంది. మెదడులో రక్తస్రావం వల్ల దీర్ఘకాల తలనొప్పి వస్తుంది. జన్యుపరీక్ష ద్వారా ఈ వ్యాధి నిర్ధారణ చేస్తారు. నివారణకు జన్యుపరమైన సలహాలు ఇస్తారు.

**బాధితులకు అవసరమైన చికిత్స ఉచితం**



జీజీహెచ్‌లోని చిన్న పిల్లల విభాగంలో హిమోఫిలియా బాధితులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు, చికిత్సలను ఉచితంగా అందిస్తున్నాం. ఈ మేరకు డైస్‌లో ప్రత్యేకంగా ఐసీహెచ్‌హెచ్ కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో జనరల్ ఫిజీషియన్‌తో పాటు చిన్నపిల్లల వైద్యులు కూడా ఉంటారు. బాధితులకు అవసరమైన పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వైద్యులు, సిబ్బంది నియమించారు. బాధితులకు అవసరమైన ఫ్యాక్టర్లు, రక్తాన్ని చిన్నపిల్లల విభాగంలో ఎక్కిస్తాం. – డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు, జీజీహెచ్, కర్నూలు

## మాదక ద్రవ్యాల దుష్ఫలితాలపై విస్తృత ప్రచారం

- పోలీస్ స్టేషన్లు, గ్రామాల్లో క్యూఆర్ కోడ్ స్కానర్ వాల్ పోస్టర్లు



క్యూఆర్ కోడ్‌పై యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కర్నూలు: మాదక ద్రవ్యాల దుష్ఫలితాల గురించి జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత అవగాహన కలిగిస్తున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాలైన డ్రగ్స్, గంజాయి వంటివి ఆయా ప్రాంతాల్లో అక్రమంగా పండిస్తున్నా, విక్రయిస్తున్నా దుర్వినియోగానికి పాల్పడుతున్నా ఆ సమాచారం తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను పోలీస్‌స్టేషన్లు పబ్లిక్ ప్రదేశాల్లో అతికించి ప్రజలు, యువకులు మొబైల్స్ నుంచి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి సమాచారం సేకరిస్తున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత ఆయా ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల గురించి సమాచారం తెలిసినట్లయితే క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా తెలియజేయాలని ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

## పిడుగు పడి మహిళ మృతి



మృతి చెందిన రజియాబీ (ఫైల్)

చిప్పగిరి: పిడుగు పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఏరూరు గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రజియాబీ (50) గ్రామ సచివాలయం పక్కన ఉన్న పొలాల్లో ఆరబోసిన మిరపకాయలు సంచులకు ఎత్తుతుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో సమీపంలో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, కుమారుడు, భర్త ఉన్నారు. తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.

## బియ్యం గోడౌన్ సీజ్



గోడౌన్‌లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం సమీపంలోని గోరుకల్లు తండాలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన లక్ష్మానాయక్‌కు చెందిన గోడౌన్‌ను సీజ్ చేశారు. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో గోరుకల్లు తండాలోని గోడౌన్‌ను ఎంపీ శబరి ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, రెవెన్యూ అధికారులతో చేరుకుని తనిఖీ చేశారు. దాదాపు 500 బస్తాల వరకు రేషన్ బియ్యం ఉండటంతో వెంటనే గోడౌన్, బియ్యాన్ని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారిలో పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరులుతుందన్నారు. అనంతరం మేకల బండ వద్ద ఉన్న రేకుల షెడ్డును పరిశీలించారు. అక్కడి నుంచి తమ్మరాజుపల్లె సమీపంలో ఉన్న రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ఎంపీ వెంట సివిల్ సప్లయి డైరెక్టర్ మహేష్ నాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మద్యం బాబులకు కిక్కు దిగేలా జరిమానా

- ఒక్కొక్కరికి రూ.10 వేలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు



డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన యువకులను కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

కర్నూలు: పోలీసు తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులకు కిక్కు దిగేలా న్యాయస్థానం జరిమానా విధిస్తోంది. మద్యం మత్తులో వాహనాలు నడపటం వల్లే ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కవయ్యాయని భావించిన పోలీసులు జిల్లా అంతటా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు విస్తృత్తం చేశారు. నిబంధనలు పాటించకుండా మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. గతంలో ఒక్కొక్కరికి రూ.3 వేలు జరిమానా విధించిన న్యాయస్థానం మందుబాబుల్లో మార్పు రావడం లేదని గుర్తించి రూ.10 వేలు జరిమానా విధించారు. మూడవ పట్టణ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురు మందు బాబులు పట్టుబడ్డారు. బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జేఎఫ్‌సీఎం కోర్టు జరిమానా విధించింది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించిన 18 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించింది.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీం కోర్టులోనే తేల్చుకుంటాం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడు హఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న హఫీజ్‌ఖాన్

కర్నూలు(టౌన్): ముస్లింల ప్రాథమిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లును సుప్రీం కోర్టులోనే తేల్చుకుంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తాను మొదటి, రెండవ పిటిషన్లు వేశామన్నారు. బుధవారం స్థానిక పాతబస్తీలోని రాయల్ ఫంక్షన్ హాలులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం సమాజాన్ని నిర్వీర్యం చేయాలని దేశంలో బీజేపీ కూటమి కంకణం కట్టుకుందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ బిల్లును ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, కడప, కర్నూలు వంటి అనేక జిల్లాలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు ప్రారంభమయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉధృతం అవుతాయన్నారు. వక్ఫ్ ఆస్తులను కొట్టేయాలని, భూములను స్వాధీనం చేసుకోవాలన్న కుట్ర జరుగుతోందన్నారు. తాజాగా కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ బిల్లులో ఇతర మతస్థులను చేర్చడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. బిల్లుకు పార్లమెంటులో 232 ఓట్లు వ్యతిరేకంగా వచ్చాయంటే వ్యతిరేకించినట్లు కాదా అన్నారు.

**ముస్లింల ఓట్లు వద్దన్న బీజేపీతో చంద్రబాబు దోస్తీ**

రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, బహిరంగంగా ముస్లింల ఓట్లు వద్దన్న భారతీయ జనతా పార్టీతో చంద్రబాబు నాయుడు దోస్తీ కట్టారన్నారు. బిల్లుకు ఆమోదం వ్యక్తం చేసిన చంద్రబాబు సిగ్గు లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం రాజ్యసభలో ఆమోదం వ్యక్తం చేసినట్లు చెప్పడం దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. మీ మద్దతు లేకుండా బిల్లు పాస్ అయ్యేదా అన్నారు. తమ పార్టీ నుంచి ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తూ మాట్లాడిన విషయం కనిపించలేదా అని ప్రశ్నించారు.



## అక్షరాస్యతలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకట నారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): ఉల్లాస్ పథకంతో నిరక్ష్యరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లాను అగ్రగామిగా నిలపాలని డీఆర్వో వెంకట నారాయణమ్మ అధికారులకు సూచించారు. వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంపై బుధవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని డీఆర్వో తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాది ఉల్లాస్ కార్యక్రమంలో మొదటి విభాగంలో 28,872 మందికి గాను 27,200 మందికి ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్‌మెంట్ టెస్టుకు హాజరవ్వగా.. అందులో 25,257 మంది పాసైనట్లు తెలిపారు. అదేవిధంగా 2025-26 విద్యాసంవత్సరంలో 30,005 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేలా లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఏప్రిల్ 16 నుంచి 24వ తేదీ వరకు 9 రోజులపాటు సర్వే మొదలు పెట్టి నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. అనంతరం వారికి మే 5 నుంచి సెప్టెంబర్18వ తేదీ వరకు టీచర్లతో తరగతులు నిర్వహించి సెప్టెంబర్ 21 ఎఫ్ఎల్ఎన్‌ఏ టెస్టును నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వయోజన విద్య శాఖ డీడీ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమం పొదుపు గ్రూపు మహిళలు, వంట ఏజెన్సీ నిర్వాహకులు, వాచ్‌మెన్‌లు, సహాయకులు, అంగన్‌వాడీ సహాయకులు, ఉపాధి కూలీల్లో నిరక్ష్యరాసులను గుర్తించి చదువు నేర్పించాలన్నారు. సమావేశంలో డీఈఓ శామ్యూల్‌పాల్, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నందవరం: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలింపుపై బుధవారం పోలీసులు దాడులు చేపట్టారు. నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు, నదికైరవాడి గ్రామానికి చెందిన ట్రాక్టర్, ఎమ్మిగనూరు టౌన్‌కి చెందిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. నాగలదిన్నెలో ఇసుక రీచ్ లేదని, అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదు హెచ్చరించారు.

## డ్రోన్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: యువత డ్రోన్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి. వెంకట బసరావు అన్నారు. హైదరాబాద్ ఐఐటీ, తిహాన్ ఫౌండేషన్, కర్నూలు ఐఐటీ డీఎం ఆధ్వర్యంలో క్లస్టర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం వీసీ ప్రారంభించి మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు ప్రతి ఒక్కరు డ్రోన్ నైపుణ్యం కలిగి ఉండడం వల్ల మంచి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. వందల ఎకరాల్లో డ్రోన్ టెక్నాలజీకి సంబంధించిన కంపెనీని స్థాపించడం ఇక్కడి విద్యార్థులకు వరమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు జరిగే శిక్షణలో 50 మంది ఎస్సీ విద్యార్థులకు 'రిమోట్లీ ఆపరేటిడ్ వెహికల్స్ -డ్రోన్స్' అనే అంశంపై, ఇతర కులాలకు చెందిన 50 మంది విద్యార్థులకు 'బూట్ క్యాంప్ డ్రోన్ టెక్నాలజీ' అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. వర్సిటీ సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవికా రాణి మాట్లాడారు. డాక్టర్ మొహమ్మద్ వాయిజ్, డాక్టర్ ఎం.పద్మావతి, లక్ష్మణ గుప్త శిక్షణ కన్వీనర్లుగా వ్యవహరించారు. వర్సిటీ డీన్ అక్తర్ బాను, ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు డాక్టర్ పి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్లు, మార్కెట్ యార్డుల్లో తనిఖీలు



సీ.క్యాంపు రైతుబజారులో మామిడి శ్యాంపుల్స్‌ను సేకరిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజార్లు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ, తూనికలు, కొలతల శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. సి.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజర్లలో కాటాలను పరిశీలించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు మామిడి పండ్లలో శ్యాంపుల్స్ సేకరించారు. రైతుబజార్లలోని దుకాణాల్లో కూడా వంట నూనెలు, ఇతర వస్తువుల నాణ్యత ప్రమాణాలను కూడా తనిఖీ చేసి శ్యాంపుల్స్ తీశారు. మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సంబంధించి కాటాలను పరిశీలించారు. కాల్షి యం కార్బైడ్‌తో మాగించిన మామిడి మార్కెట్‌లోకి వస్తున్న నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్యాంపుల్స్ సేకరించారు. నగరంలోని వివిధ వాటర్‌ప్లాంట్లతో కూడా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో డీఎస్‌వో రాజారఘువీర్, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ దొంగలు దొరికారు

- 11 మంది అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ
- రూ.10.35 లక్షల నగదు, 350 లీటర్ల డీజిల్, నాలుగు వాహనాలు స్వాధీనం
- ముఠా సభ్యులంతా తెలంగాణ వాసులే




కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత, చిత్రంలో సీఐ శ్రీరామ్ పోలీసులు

ఆదోని అర్బన్: గత ఎనిమిదేళ్ల నుంచి డీజిల్ చోరీని వృత్తిగా ఎంచుకున్న ముఠా సభ్యులు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డారు. బుధవారం సిరుగుప్ప చెక్ పోస్టు వద్ద అనుమానాస్పదంగా ఉన్న 11 మంది దొంగలను ఆదోని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా డీజిల్ దొంగలుగా తేలింది. ఈ మేరకు ఆదోని డీఎస్పీ హేమలత, ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ మీడియా ఎదుట నిందితులను హాజరుపరిచారు.. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట ప్రాంతానికి చెందిన రమేష్‌నాయక్ అలియాస్ చోటా నాయక్, పాండు నాయక్, పాపా నాయక్, రవి నాయక్, మహేష్ నాయక్, కిషన్ నాయక్, పాల్తియారవి నాయక్ అలియాస్ బిల్లా రవి, సభావత్ రవి నాయక్, చావన్‌సురేష్ నాయక్ అలియాస్ దేశముదురు, వర్త కిషన్ నాయక్, రవికుమార్ రాథోడ్‌లు కలిసి డీజిల్ చోరీని వృత్తిగా ఎంచుకున్నారు. దొంగలించిన డీజిల్‌ను ఇతర ప్రాంతాల్లో విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడేవారు. డీజిల్ చోరీకి నాలుగు వాహనాలను వినియోగిస్తూ ఎక్కడైనా పార్కింగ్‌లో లారీలను ఆపిన చోటుకు వాహనాల్లో వెళ్లి డీజిల్ దొంగతనం చేసి కార్లలో తరలించేవారు. ఇలా మొత్తం డీజిల్ దొంగతనంలో 10,620 లీటర్లు దొంగతనం చేసినట్లు విచారణలో తేలింది. గత నెల మార్చి 11వ తేదీన సర్దార్‌బాషా, ఈనెల 8వ తేదీన మైల రామకృష్ణ, సయ్యద్‌సమీర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు. నెల రోజులుగా ఈ ముఠాను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. బుధవారం అందిన సమాచారం మేరకు సీఐ శ్రీరామ్, సిబ్బందితో కలిసి స్థానిక సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద 11 మందిని అరెస్టు చేశారని తెలిపారు. వారి నుంచి రూ.10,30,140 నగదు, 350 లీటర్ల డీజిల్, నాలుగు వాహనాలు (కార్లు), 10 ఖాళీ క్యాన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయన్నారు. కేసును త్వరితగతిన చేధించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.